# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 19 సంచిక : 50 బుధవారం 22, అక్టోబర్ 2025 పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com


# రెండేళ్లలో కొత్త ఉస్మానియా



ఆసుపత్రి నిర్మాణానికి స్పెషల్ అధికారి నియామకం

రెండేళ్లలో పూర్తి అయ్యేలా ప్రణాళిక

పనుల వేగవంతానికి వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ

వందేళ్ల అవసరాలకు తగినట్టుగా వసతుల కల్పన

ప్రతి పది రోజులకోసారి సమావేశమై సమస్యలకు చెక్

బందోబస్తు, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్లాన్

ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

రాష్ట్రంలోని ఇతర పెండింగ్ నిర్మాణాలపైనా చర్చ

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రులు, మెడికల్ కళాశాలల నిర్మాణాలకు సంబంధించి ఒక్కో అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆయా నిర్మాణాలపై ఎప్పటికప్పుడు సదరు అధికారి పర్యవేక్షించేలా పూర్తి స్థాయి బాధ్యతలను అప్పగించాలని సూచించారు. వచ్చే జూన్ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఉస్మానియాపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు తెలిపారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణంపై బుధవారం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించి మిగతా 3లో..



# రేవంత్ ప్రకటనలు ఘనం.. ఆచరణ శూన్యం..!

స్కావెంజర్ల 9 నెలల పెండింగ్ వేతనాలు ఇంకా చెల్లించలేదు

రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల బెనిఫిట్స్ కూడా పెండింగే

మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించని ప్రభుత్వం

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

మాజీ మంత్రి హరీష్ రావు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనలు ఘనంగా ఉన్నప్పటికీ ఆచరణలో మాత్రం శూన్యం అని ఆయన అన్నారు. "గాలి మాటలతో ప్రజలను ఎంతకాలం మోసం చేస్తారు?" అని హరీష్ రావు ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం నియమించిన స్కావెంజర్లకు 9 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం సిగ్గుమాలిన చర్య అని హరీష్ రావు పేర్కొన్నారు. చిన్న ఉద్యోగుల శ్రమను, కష్టాన్ని గౌరవించడం సర్కార్‌కు ఎందుకు సాధ్యం కాకపోతుందో విమర్శించారు. అలాగే, కాంగ్రెస్ పాలనలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు బెనిఫిట్స్ కోసం, స్కావెంజర్లు వేతనాల కోసం నెలలుగా ఎదురుచూస్తూ నరకయాతన అనుభవిస్తున్నారని హరీష్ రావు తెలిపారు. ఈ పరిస్థితి ద్వారా ప్రజలకు సేవలందించిన విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగుల హక్కులు మానసికంగా హానికరంగా ఎదురవుతున్నాయని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం కూడా ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఉన్నదని మిగతా 2లో..

## ఆర్ఎస్ఎస్ ను అడ్డుకోవడం ఎవరి తరం కాదు

హేళన చేసిన వాళ్లే భాగ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకుటున్నారు

లక్షలాది మంది అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది

ప్రపంచానికి భాగ్యలక్ష్మీ అమ్మవారి శక్తి చాటిచెప్పే అవకాశం రావడం నా అదృష్టం

బీజేపీ అధికారంలోకి రాగానే గోల్డెన్ టెంపుల్ గా మారుస్తాం : బండి సంజయ్



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

పాతబస్తీలో భాగ్యలక్ష్మి ఆలయం ఎక్కడుంది? అంటూ హేళన చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఈరోజు కళ్లు తెరిచి అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. భాగ్యలక్ష్మి అమ్మవారి శక్తిని ప్రపంచానికి చాటిచెప్పే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. అమ్మవారిని మిగతా 2లో..



## కేసీఆర్ తో హరీష్ రావు, కేటీఆర్ భేటీ

సుదీర్ఘంగా సాగిన చర్చ

ఇప్పటివరకు జరిగిన ప్రచారసరళిపై కేసీఆర్ ఆరా

కాంగ్రెస్, బీజేపీపై ప్రజల్లో ఫీడ్ బ్యాక్

పలు అంశాలపై దిశానిర్దేశం

03

## అందుకే చెక్ పోస్టులు మూసివేశాం

చెక్కు పోస్టుల రద్దుతో రవాణా వ్యవస్థలో నూతన దశ

ఈవీ పాలసీతో పర్యావరణ పరిరక్షణ దిశగా తెలంగాణ

రోడ్ సేఫ్టీ అవగాహనకు ప్రత్యేక చర్యలు

రవాణా శాఖలో పారదర్శకత, బ్రోకర్ వ్యవస్థపై కఠిన చర్యలు

రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చెక్ పోస్టులను రద్దు చేస్తూ జీవో జారీ చేసినట్లు ప్రకటించారు. ప్రజల్లో అవగాహన మిగతా 2లో..

## కోదండ రామ్ పాత్ర చరిత్రలో నిలిచిపోయేది

తెలంగాణ ఆవిర్భావంలో ఆయన పాత్ర కీలకం

నిస్వార్థంగా నిజాయితీగా రాష్ట్ర సాధన కోసం కృషి చేశారు

పదేళ్ల బీఆర్ఎస్ పాలన ఎలా గాడి తప్పిందో ప్రజలకు తెలుసు

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక నేపథ్యంలో రాజకీయ చర్చలు వేడెక్కాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బుధవారం తెలంగాణ జన సమితి (టీజేఎస్) కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండ రామ్‌ను కలిశారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలన్న అంశంపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. కోదండరామ్‌తో జరిగిన సమావేశం అనంతరం టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావంలో కోదండరామ్ పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఆయన నిస్వార్థంగా, నిజాయితీతో రాష్ట్ర సాధన కోసం కృషి చేశారని గుర్తుచేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఎలా నిరంకుశంగా మారిందో అందరికీ తెలుసని మహేష్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఆ పాలన నుంచి విముక్తి కోసం కాంగ్రెస్, టీజేఎస్ సహా ప్రజాసంఘాలన్నీ కలిసి 2023 ఎన్నికల్లో మిగతా 2లో..

## జూబ్లీహిల్స్ కోసం బీజేపీ భారీ వ్యూహం..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బీజేపీ ప్రత్యేక దృష్టి

40 మందితో స్టార్ క్యాంపెయినర్ల జాబితా విడుదల

ప్రచార బరిలోకి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్

రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ కూడా ప్రచారానికి

జాబితాలో కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్

పొరుగు రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులకు కూడా చోటు




02



## ఉగ్రవాదంపై కలిసి పోరాడదాం

వైట్‌హౌస్‌లో దీపావళి వేడుకలు జరిపిన ట్రంప్

ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడానన్న అమెరికా అధ్యక్షుడు

రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గిస్తామని మోదీ హామీ ఇచ్చారని వెల్లడి

భారత్-పాక్ యుద్ధాన్ని ఆపింది తానేనని మరోసారి వ్యాఖ్య

ఉగ్రవాదంపై పోరాటమే ముఖ్యమన్న ప్రధాని మోదీ



## సచివాలయం ముట్టడిస్తాం

రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లిస్తారా? లేదా?

మంత్రులెవరినీ తిరగనివ్వం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

02



## రేవంత్ ప్రకటనలు ఘనం.. ఆచరణ శూన్యం.!

మొదటిపేజీ తరువాయి

ఆయన విమర్శించారు. "కేసీఆర్ ప్రారంభించిన సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం నిలిపివేయబడింది. మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించకుండా, అమలు గాలికి వదిలివేశారు. మీ సొంత శాఖలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల వేతన సమస్యలు కనిపించడం లేదా?" అని హరీష్ రావు ప్రశ్నించారు. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చి, ఆచరణలో గాలి మాటలకు గురి చేస్తే ఉద్యోగులను మోసం చేయడం అనైతికమని పేర్కొన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం నెలలుగా ఎదురుచూస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆవేదన వింటే మనస్సు చెలించిపోతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. స్కావెంజర్ల 9 నెలల పెండింగ్ వేతనాలు కూడా తక్షణమే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వానికి ఆహ్వానించారు. ఈ పరిస్థితి ద్వారా సర్కార్ సొంత మాటల మాయాజాలంలో మిగిలిపోకుండా, ఉద్యోగుల హక్కులను గౌరవించాల్సిన అవసరం ఉందని హరీష్ రావు స్పష్టం చేశారు.

## కోదండ రామ్ పాత్ర చరిత్రలో నిలిచిపోయేది

మొదటిపేజీ తరువాయి



పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. "కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంలో టీజేఎస్ సహకారం ఎంతో విలువైనది. దాన్ని మేము ఎప్పటికీ మరవం," అని తెలిపారు. ఉద్యోగ నియామక రూపకల్పనలో కోదండరామ్ సలహాలు, సూచనలు ఎంతో విలువైనవని మహేష్ గౌడ్ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా పాలన కొనసాగుతుందని హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో యువ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని టీజేఎస్‌ను కోరారు. సీపీఐ, సీపీఎం, ఏఐఎంఐఎం మాదిరిగా టీజేఏసీ మద్దతు కూడా కోరినట్లు తెలిపారు. ఇక బీజేపీ నేతలపై తీవ్రంగా విరుచుకుపడ్డ ఆయన... "కేంద్రమంత్రి స్థాయిలో ఉన్న బండి సంజయ్ ఏమి మాట్లాడుతున్నారో తనకే అర్థమవుతున్నదా? మత విద్వేషాలు రెచ్చగొట్టి, సెంటిమెంట్లు రాజేసి లబ్ధి పొందాలన్నదే బీజేపీ పన్నాగం," అని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మతవాద శక్తులకు బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. మిత్రపక్షాలతో ఇచ్చిన మాటను కాంగ్రెస్ నిలబెట్టుకుంటుందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన కొనసాగుతుందని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.

## అందుకే చెక్ పోస్టులు మూసివేశాం

మొదటిపేజీ తరువాయి

కల్పించడానికి, అన్ని లావాదేవీలు పారదర్శకంగా ఆన్లైన్‌లో జరగాలనే ఉద్దేశంతో రెండు నెలల క్రితం నిర్ణయం తీసుకుని, ఈరోజు నుండి చెక్ పోస్టులు పూర్తిగా మూసివేస్తూ అమలు చేస్తున్నామని తెలిపారు. రవాణా వ్యవస్థలో ఆధునికత, పారదర్శకతను తీసుకురావడమే ఈ నిర్ణయానికి ప్రధాన ఉద్దేశమని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వాహన్ అమలు కొనసాగిస్తోందని, త్వరలోనే సారథి సిస్టమ్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రవాణా శాఖలో కృత్రిమ మేధ (AI) టెక్నాలజీని వినియోగిస్తూ పారదర్శక వ్యవస్థను నెలకొల్పుతున్నామని చెప్పారు. కార్యాలయాల్లో రెగ్యులర్‌గా వచ్చే దరఖాస్తుదారుల వివరాలు స్వయంచాలకంగా రికార్డ్ అవుతూ, హెడ్ ఆఫీస్‌కు అలర్ట్‌లు పంపే విధంగా సిస్టమ్ అమలు చేస్తున్నామన్నారు. అదే సమయంలో వాహనాలకు సంబంధించిన రికార్డులు, టాక్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ వంటి అంశాలను ఆన్లైన్ ద్వారా పర్యవేక్షించే చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈవీ (ఎలక్ట్రిక్ వెహికల్స్) పాలసీ అమలుతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.577 కోట్ల ట్యాక్స్ మినహాయింపు ఇచ్చిందని తెలిపారు. ఇవి వాహనాల అమ్మకాల వాటా 0.03 శాతం నుండి 1.13 శాతానికి పెరిగిందని మంత్రి చెప్పారు. ఢిల్లీలో లాగా కాలుష్య పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలుగా తెలంగాణ ఇవి పాలసీని రూపొందించిందని వివరించారు. నగరంలో 20 వేల ఎలక్ట్రిక్ ఆటోలకు, LPG, CNG ఆటోలకు 10 వేల చొప్పున, అలాగే 25 వేల రిట్రోఫిటింగ్ ఆటోలకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. పాత వాహనాల స్థానంలో ఇవి వాహనాలను ప్రోత్సహించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా ఆధునిక రవాణా వాతావరణాన్ని సృష్టిస్తున్నామని చెప్పారు. రోడ్ సేఫ్టీపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు రవాణా శాఖ పలు కార్యక్రమాలు చేపట్టిందని మంత్రి వివరించారు. నాచారం, కరీంనగర్‌లలో రోడ్ సేఫ్టీ చిల్డ్రన్ అవేర్‌నెస్ పార్క్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. కాలేజీల్లో రోడ్ సేఫ్టీ క్లబ్బులు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో



అవగాహన పెంచుతున్నామని చెప్పారు. ఆటోమేటిక్ డ్రైవింగ్ లైసెన్స్ సిస్టమ్‌ను తీసుకువచ్చే ప్రణాళిక ఉందని తెలిపారు. గత 10 సంవత్సరాల్లో రవాణా శాఖలో అవినీతి మూలాల్లా ఏర్పడిందని విమర్శించిన మంత్రి, ఇప్పుడు పారదర్శక వ్యవస్థను తీసుకువస్తున్నామని తెలిపారు. బ్రోకర్ వ్యవస్థను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 63 కేంద్రాల్లో కెమెరాల ద్వారా పర్యవేక్షణ జరుగుతోందని చెప్పారు. 112 మంది AMVI లను నియమించి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పోలీస్, ఆర్టీసీతో పాటు ఇతర శాఖల్లో ఉన్న పాత వాహనాలను స్క్రాప్‌కి పంపించాలని ఆదేశించామని వివరించారు. చెక్ పోస్టులను రద్దు చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కేబినెట్‌లో ఆమోదం పొందినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. రాబోయే కాలంలో మొత్తం ఆదాయాన్ని ఆన్లైన్ ద్వారా సేకరించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1.7 కోట్ల వాహనాలు ఉన్నాయని, రోడ్ ప్రమాదాలు తగ్గించేందుకు పలు సంస్కరణలు అమలు చేస్తున్నామని వివరించారు. వాహన్, సారథి సిస్టమ్‌ల ద్వారా తెలంగాణ కూడా దేశంలోని మిగిలిన 28 రాష్ట్రాలతో సమానంగా సాంకేతికతలో ముందంజ వేస్తుందని తెలిపారు. "గత పదేళ్లలో తెలంగాణ వాహన్, సారథి ప్లాట్‌ఫారమ్‌లలో ఎందుకు చేరలేదో తెలియదు. ఇప్పుడు మేము చేరాం, డేటా ట్రాన్స్‌ఫర్మింగ్ జరుగుతోంది. వాహన్ ఇప్పటికే అమల్లో ఉంది, సారథిని త్వరలో అమలు చేస్తాం. ఇకపై రవాణా శాఖలో అవినీతి లేదా అనధికార వ్యవహారాలకు చోటు ఉండదు," అని మంత్రి స్పష్టం చేశారు. చెక్ పోస్టుల రద్దు వల్ల అక్రమ రవాణా జరగకుండా ఎన్ఫోర్స్‌మెంట్‌ను మరింత బలోపేతం చేస్తున్నామని అన్నారు.

# ఆర్ఎస్ఎస్ ను అడ్డుకోవడం ఎవరి తరం కాదు

మొదటిపేజీ తరువాయి

దర్శించుకున్నాకే ప్రజాసంగ్రామ యాత్ర విజయవంతమైందని, జీహెచ్ఎంసీ, హుజూరాబాద్, దుబ్బాక ఎన్నికల్లో బీజేపీ గెలిచిందన్నారు. పార్లమెంట్ లో 8 స్థానాలు గెలుచుకోవడమే కాకుండా విజయ పరంపరను కొనసాగిస్తున్నామని చెప్పారు. లక్షలాది మంది అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని స్వర్ణ దేవాలయంగా మారుస్తామని పునరుద్ఘాటించారు. కర్నాటకలో ఆరెస్సెస్ పథ సంచలన్ లో పాల్గొన్నందుకు ఓ ప్రభుత్వ అధికారిని సస్పెండ్ చేయడంపై తీవ్రంగా స్పందించారు. కర్నాటకలో బీజేపీ అధికారంలోకి రాగానే సదరు అధికారికి రెండున్నరేళ్ల కాలానికి జీతభత్యాలు ఇవ్వడంతోపాటు ప్రమోషన్ ఇస్తామని స్పష్టం చేశారు. దీపావళి పర్వదినం ఈరోజు సాయంత్రం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ రాష్ట్ర నాయకులు గంగిడి మనోహర్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రకాశ్ రెడ్డి, జె.సంగప్ప, ఉమా మహేందర్ తదితరులతో కలిసి పాతబస్తీ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు సంజయ్ కు ఘన స్వాగతం పలికి ప్రత్యేక ఆశీర్వచనం అందించారు.

అనంతరం ఆయా నేతలతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ. 'దీపావళి పర్వదినం సందర్భంగా పాతబస్తీ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది. హిందూ బంధువులందరికీ దీపావళి శుభాకాంక్షలు. అమ్మవారి శక్తి అందరికీ తెలుసు. అమ్మవారి కరుణాకటాక్షం కోసమే అందరం ఇక్కడికి వస్తున్నం. అమ్మవారివల్లే తెలంగాణలో అందరం సుభిక్షంగా ఉన్నాం. నాకైతే కరీంనగర్ లో మహాశక్తి అమ్మవారు, భాగ్యనగర్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీర్వాదం, కరుణాకటాక్షంతోనే ధర్మం కోసం, దేశం కోసం పనిచేస్తున్నా. భాగ్యలక్ష్మి అమ్మవారిని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పే అవకాశం, అదృష్టం నాకు దక్కడం చాలా ఆనందంగా ఉంది. నేను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భాగ్యలక్ష్మి అమ్మవారి పాదాల సాక్షిగా ప్రజా సంగ్రామ యాత్రను ప్రారంభించినం. ఎండకు, వానకు, చలిని తట్టుకుని ఎన్ని ఆటంకాలు, అడ్డంకులు వచ్చినా పాదయాత్రను విజయవంతం చేసినం. 1600 కి.మీలు పాదయాత్ర చేసిన. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అమ్మవారిని దర్శించుకుని ఎన్నికల్లో పోటీ చేసి హిందూ సంఘటిత శక్తిని చాటినం. అమ్మవారి దయవల్లే 4 నుండి 48 స్థానాలు గెలిచినం. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లోనే అమ్మవారి దర్శనం తరువాతే గెలిచినం. మునుగోడు ఎన్నికల్లో నాటి ప్రభుత్వం అనేక అరాచకాలు గెలిచినా పోరాడి గెలుపు అంచులదాకా వచ్చినం. అమ్మవారి దయతోనే బీజేపీ 8 ఎంపీ స్థానాల్లో గెలిచినం. విజయపరంపరను కొనసాగిస్తున్నాం.

గతంలో భాగ్యలక్ష్మి అమ్మవారు లేనే లేదు. బండి సంజయ్ కొత్త కొట్లాట పెడుతున్నారని కాంగ్రెస్, బీఆర్ఎసోళ్లు హేళన చేశారు. ఆనాడు హేళన చేసిన వాళ్లే ఇయాళ అమ్మవారి శక్తి తెలుసుకుని దర్శించుకుంటున్నారు. ఆలస్యంగానైనా అమ్మవారి శక్తిని తెలుసుకున్నందుకు అభినందనలు. అమ్మవారి శక్తి తెలుసుకాబట్టే కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా ఎంతో మంది ప్రముఖులు దర్శనం చేసుకున్నారు. అందుకే బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం. రాబోయే రోజుల్లో రాబోయేది మోదీ రాజ్యమే.



కర్నాటకలో ఆర్ఎస్ఎస్ పథ సంచలన్ లో పాల్గొన్న పాపానికి ఒక ప్రభుత్వ అధికారిని సస్పెండ్ చేయడం దుర్మార్గం. తీవ్రంగా ఖండిస్తున్నా. ఆర్ఎస్ఎస్ రాజకీయ పార్టీ కాదు. సాంస్కృతిక, జాతీయవాద సంస్థ. ఆర్ఎస్ఎస్ లాంటి క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన గొప్ప సంస్థ అని నాటి ప్రధాని ఇందిరాగాంధీ చెప్పారు. అంతెందుకు కర్నాటక డిప్యూటీ సీఎంగా పనిచేస్తున్న శివకుమార్ సైతం అసెంబ్లీ సాక్షిగా ఆర్ఎస్ఎస్ గీతం పాడి గొప్పతనాన్ని తెలియజేశారు.

కాంగ్రెస్ ఉండేది ఇంకా రెండేళ్లే. రెండేళ్ల దాకా సస్పెండైన అధికారి ఆర్ఎస్ఎస్ ద్వారా దేశ సేవ చేయాలని కోరుతున్నా. రెండేళ్ల తరువాత కర్నాటకలో మళ్లీ వచ్చేది బీజేపీ ప్రభుత్వమే. అధికారంలోకి రాగానే సస్పెండైన అధికారికి రెండున్నరేళ్ల జీతభత్యాలన్నీ ఇవ్వడం తోపాటు ప్రమోషన్ కూడా ఇస్తాం. ఒక్కటి మాత్రం చెబుతున్నా. అరచేతిని అడ్డం పెట్టి సూర్యుడిని ఆపలేమన్నది ఎంత సత్యమో, నిషేధం పేరుతో ఆర్ఎస్ఎస్ ను అడ్డుకోలేరనేది కూడా అంతే సత్యం.' అని వ్యాఖ్యానించారు.

## సచివాలయం ముట్టడిస్తాం

- **రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లిస్తారా? లేదా?**
- **మంత్రులెవరినీ తిరగనివ్వం**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను పూర్తిగా చెల్లిస్తారా? లేదా? అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రశ్నించారు. చెల్లించకుంటే కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థులతో కలిసి సచివాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ప్రచారంలో భాగంగా అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి మద్దతుగా బుధవారం నిర్వహించిన పాదయాత్రకు రాంచందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకుంటే మంత్రులెవరినీ రోడ్లపై తిరగనివ్వబోమని వార్నింగ్ ఇచ్చారు. బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులతో బెదిరించాలనుకుంటున్నారా? అని ఫైరయ్యారు. రాష్ట్రంలో బ్లాక్ మెయిల్ సర్కార్ నడుస్తోందని విమర్శలు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఎగ్గొడుతున్న కాంగ్రెస్‌ను ఏం చేయాలని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్ తో చెలగాటమాడతారా? అంటూ రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతినెలా రూ.500 కోట్లు చెల్లిస్తామంటూ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటను తప్పుతారా? అంటూ ధ్వజమెత్తారు. పదే పదే టోకెన్లు ఇచ్చి కూడా బకాయిలు చెల్లించలేని అసమర్థ సర్కార్ కాంగ్రెస్ దేనని ఫైరయ్యారు. తక్షణమే బకాయిలు మొత్తం చెల్లించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సెగ్మెంట్ లో పలు ప్రాంతాల్లో గడపగడపా తిరిగి ప్రజలతో మమేకమయ్యారు. ఇది కేవలం ఉపఎన్నిక మాత్రమే కాదని, రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతకు ప్రతీక అని చెప్పారు. తొలుత ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన ఉద్యమ యోధుడు కుమ్రం భీం జయంతి సందర్భంగా రాంచందర్ రావు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.



## ఉగ్రవాదంపై కలిసి పోరాడదాం

- **వైట్‌హౌస్‌లో దీపావళి వేడుకలు జరిపిన ట్రంప్**
- **ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడానన్న అమెరికా అధ్యక్షుడు**
- **రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గిస్తామని మోదీ హామీ ఇచ్చారని వెల్లడి**
- **భారత్-పాక్ యుద్ధాన్ని ఆపింది తానేనని మరోసారి వ్యాఖ్య**
- **ఉగ్రవాదంపై పోరాటమే ముఖ్యమన్న ప్రధాని మోదీ**

**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీతో తాను ఫోన్‌లో మాట్లాడానని, పలు కీలక అంశాలపై ఆయన హామీ ఇచ్చారని ట్రంప్ ప్రకటించగా, అలాంటి ఫోన్ కాల్ ఏదీ జరగలేదని భారత ప్రభుత్వం స్పష్టం చేయడంతో గందరగోళం నెలకొంది.

వైట్‌హౌస్‌లో జరిగిన దీపావళి వేడుకల సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, "నేను ఈరోజే మీ ప్రధానమంత్రితో మాట్లాడాను. మా మధ్య గొప్ప సంభాషణ జరిగింది. వాణిజ్యంతో పాటు అనేక విషయాలు చర్చించాం" అని విలేకరులతో అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ గణనీయంగా తగ్గిస్తుందని మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ పునరుద్ఘాటించారు. అంతేకాకుండా, గతంలో భారత్‌పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తాను ఆపగలిగానని మరోసారి వ్యాఖ్యానించారు. అయితే, ట్రంప్ చేసిన ఈ ప్రకటనలను భారత ప్రభుత్వం తోసిపుచ్చింది. ప్రధాని మోదీకి, ట్రంప్‌కు మధ్య జరిగిన దీపావళి ఫోన్ సంభాషణలో ఇలాంటి అంశం ప్రస్తావనకు రాలేదని స్పష్టం చేసింది. ఇంధన దిగుమతులపై భారత్ తన ప్రయోజనాలను కాపాడుకుంటుందని, వినియోగదారుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని పరోక్షంగా ఓ ప్రకటన విడుదల చేసింది.

మరోవైపు, ప్రధాని నరేంద్ర మోదీ ఆన్‌లైన్‌లో ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దీపావళి శుభాకాంక్షలు తెలిపినందుకు ధన్యవాదాలు చెబుతూనే, ఆయన వ్యూహాత్మకంగా స్పందించారు. "మీ ఫోన్ కాల్, దీపావళి శుభాకాంక్షలకు ధన్యవాదాలు. ఈ వెలుగుల పండుగ సందర్భంగా మన రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాలు ప్రపంచానికి ఆశాకిరణంగా నిలవాలి. అన్ని రకాల ఉగ్రవాదంపై కలిసికట్టుగా పోరాడాలి" అని తన పోస్టులో పేర్కొన్నారు. ఉగ్రవాదంపై పోరాటానికి ప్రాధాన్యం ఇస్తూ మోదీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## జూబ్లీహిల్స్ కోసం బీజేపీ భారీ వ్యూహం..

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికను భారతీయ జనతా పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ ఎన్నికల ప్రచారం కోసం ఏకంగా 40 మందితో కూడిన స్టార్ క్యాంపెయినర్ల జాబితాను విడుదల చేసి, తమ పూర్తిస్థాయి శక్తిని ప్రదర్శించేందుకు సిద్ధమైంది. ఈ జాబితాలో కేంద్ర మంత్రులు, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి సహా పలువురు జాతీయ, రాష్ట్ర స్థాయి అగ్రనేతలకు చోటు కల్పించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

జూబ్లీహిల్స్ ప్రచార బాధ్యతలను మోసే వారిలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వంటి కీలక నేతలు ఉన్నారు. ఈ ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యంగా బీజేపీ అధిష్ఠానం జాతీయ స్థాయి నాయకులను రంగంలోకి దించుతోంది. తెలంగాణ నుంచి కూడా పార్టీ ముఖ్య నేతలందరినీ ఈ జాబితాలో చేర్చింది. కేంద్ర మంత్రులు, సికింద్రాబాద్ ఎంపీ జి. కిషన్ రెడ్డి, కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌లతో పాటు తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు కూడా ప్రచారంలో పాల్గొననున్నారు. వీరితో పాటు మాజీ మంత్రులు ఈటల రాజేందర్, డీకే అరుణ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు వంటి ప్రముఖులు సైతం ప్రచార సారథులుగా వ్యవహరించనున్నారు.

ఈ జాబితాలో బీజేపీ యువమోర్చా జాతీయ అధ్యక్షుడు తేజస్వి సూర్య, ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై వంటి పొరుగు రాష్ట్రాల నేతలకు కూడా స్థానం కల్పించారు. వీరితో పాటు డాక్టర్ కె. లక్ష్మణ్, ధర్మపురి అరవింద్, సుజనా చౌదరి, బూర నర్సయ్య గౌడ్, పొంగులేటి సుధాకర్ రెడ్డి, గరికపాటి మోహన్ రావు సహా మొత్తం 40 మంది నేతలు జూబ్లీహిల్స్‌లో పార్టీ అభ్యర్థి తరఫున ప్రచారం చేయనున్నారు.





# కేసీఆర్ తో హరీష్ రావు, కేటీఆర్ భేటీ

- సుదీర్ఘంగా సాగిన చర్చ
- ఇప్పటివరకు జరిగిన ప్రచారసరళిపై కేసీఆర్ ఆరా
- కాంగ్రెస్, బీజేపీపై ప్రజల్లో ఫీడ్ బ్యాక్
- పలు అంశాలపై దిశానిర్దేశం

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

గులాబీ అధినేత కేసీఆర్ తో ఎర్రవెల్లి నివాసంలో బుధవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు భేటీ అయ్యారు. సుదీర్ఘంగా చర్చించారు. ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలపైనా చర్చించారు. ఇప్పటికే డివిజన్ల వారీగా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ ప్రజాప్రతినిధులతో ప్రచారం చేయిస్తున్నట్లు వివరించినట్లు సమాచారం. కాంగ్రెస్ రెండేళ్లలో చేసిన అంశాలను చెబుతున్నారని, మాగంటి సునితపై విమర్శలు చేస్తున్నారని, బీజేపీ మళ్లీ దేవుడి పేరుతో రాజకీయం చేస్తుందని కేసీఆర్ కు వివరించారు. ఇప్పటివరకు ప్రచారంతో ఏ మేరకు వెళ్లారని, ప్రజల్లో ఎలాంటి స్పందన ఉందని కేసీఆర్ ఆరా తీసినట్లు సమాచారం. బీఆర్ఎస్ కు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు కలిసి వస్తాయని, గోపీనాథ్ పై ఉన్న సానుభూతి సైతం ప్లస్ అవుతుందని కేటీఆర్, హరీష్ రావు వివరించినట్లు సమాచారం. ఇంకా ప్రచారంలో దూకుడు పెంచాలని, కొత్తధోరణులు అవలంభించాలని, కాంగ్రెస్ చెప్పిన తప్పిదాలను ప్రధానంగా వివరించాలని సూచించినట్లు సమాచారం. బీఆర్ఎస్ కు ప్రజల్లో సానుభూతి ఉందని, కలిసి వస్తుందని నేతలంతా సమిష్టిగా కష్టపడితే విజయం సాధిస్తామని కేసీఆర్ పేర్కొన్నట్లు సమాచారం. కాంగ్రెస్ కు వామపక్షాలు మద్దతు తెలిపినప్పటికీ మనం అధైర్యపడాల్సిన అవసరం లేదని సూచించినట్లు తెలిసింది.

# రెండేళ్లలో కొత్త ఉస్మానియా

**మొదటిపేజీ తరువాయి**


తగిన ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు స్థానికులకు ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. నిర్మాణ పనుల వేగవంతానికి వైద్యారోగ్య శాఖ, పోలీస్, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రతి పది రోజులకోసారి సమావేశమై సమస్యలకు చెక్ పెడుతూ పనులు వేగంగా జరిగేలా చూడాలని ఆదేశించారు.

**ముందుస్తుగానే తగిన ప్రణాళికలు**

ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యాక అక్కడి బందోబస్తు, ట్రాఫిక్ విధుల నిర్వహణకు సంబంధించి ముందుస్తుగానే తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీస్ శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ఆసుపత్రికి వివిధ రహదారులను అనుసంధానించే ప్రణాళికలు ఇప్పటి నుంచే రూపొందించాలని ఆర్ అండ్ బీ అధికారులకు తెలిపారు. ఈ సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీలు శేషాద్రి, శ్రీనివాసరాజు, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, డీజీపీ శివధర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు వికాస్ రాజ్, క్రిస్టియానా జోంగ్తూ, ఇలంబర్తి, ముషారఫ్ అలీ ఫరూఖీ, హరిచందన తదితరులు పాల్గొన్నారు.



## మరణించిన కుటుంబాలకు
# పీఎస్ఆర్ ట్రస్ట్ సాయం



**ఖమ్మం,అక్టోబర్ 22 (ప్రజాస్వరం):**


ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల మరణించిన కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఈ సాయం అందించారు.గత నెల సెప్టెంబర్ 15 నుండి అక్టోబర్ 20 వరకు మరణించిన వ్యక్తుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10,000 చొప్పున సహాయం బుధవారం పంపిణీ చేశారు.జలగం నగర్, కేబిఆర్ నగర్, ఆర్టీసీ కాలనీ, పెద్దతండా, వరంగల్ క్రాస్ రోడ్, గుర్రాలపాడు, ఇందిరమ్మ కాలనీ, గుదిమళ్ల, తెల్దారుపల్లి, మద్దులపల్లి, బారుగూడెం, ఏదులాపురం, సూర్యనగర్, చిన్నతండా,సత్యనారాయణపురం, రాజీవ్ గృహకల్ప తదితర ప్రాంతాల్లో మొత్తం 37 కుటుంబాలు లబ్ధి పొందాయి.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు,పొంగులేటి అభిమానులు పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.



# చిన్నారులను ఆశీర్వదించిన కమలాపూర్ ఎస్సై వీరభద్ర రావు,పరకాల ఎస్సైలు రమేష్,పవన్

**పరకాల,అక్టోబర్ 22(ప్రజాస్వరం):**

పరకాల సీఎస్ఐ కాలనీకి చెందిన ఒంటేరు నాగజ్యోతి కుమార్ దంపతుల కూతుళ్లు నివేదిత శర్మ, నవనీత రాణి గార్ల నూతన వస్త్రాలంకరణ అదేవిధంగా కుమారుడు. అద్విక్ తేజ్ దోవతి కట్టించుట వేడుకల్లో పాల్గొని, కమలాపూర్ ఎస్సై వీరభద్ర రావు, పరకాల ఎస్సైలు రమేష్, పవన్, దామరంచపల్లె మాజీ ఎంపీటీసీ బోట్ల రవి సామ్రాట్ చిన్నారులను ఆశీర్వదించారు.





# మేకలను ఢీకొన్న కంటైనర్ వాహనము 12 మేకలు మృతి

**బంగారుపాళ్యం,అక్టోబర్ 22(ప్రజాస్వరం):**

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం బెంగళూరు చెన్నై జాతీయ రహదారి గుండ్ల కట్టమంచి వద్ద అదే గ్రామానికి చెందిన లెట్ చిన్నస్వామి కుమారుడు మునిరాజులు తన మేకలను గ్రామానికి దగ్గరలోని కొండకు మేతకై తోలుకొని సాయంత్రం సుమారు 6.30 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన గుర్తు తెలియని కంటైనర్ వాహనం ఢీకొని 12 మేకల పైన వాహనం వెళ్లడంతో అవి అక్కడికక్కడే మృతి చెందగా 4 మిగతా కొన ఊపిరితో కొట్టి మిట్టాడుతున్నట్లు తెలిసింది.సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకున్న రూరల్ పోలీసులు.

**కరీంనగర్ రూరల్,అక్టోబర్ 22 (ప్రజాస్వరం):**

గర్రెపల్లి గ్రామం, సుల్తానాబాద్ మండలానికి చెందిన పిట్టల తిరుపతి తండ్రి రాజమల్లు మరియు మద్దెల శ్రవణ్ కుమార్ తండ్రి మల్లయ్య ఇద్దరు కలిసి వారి యొక్క రెండు ట్రాక్టర్లలో చేగుర్తి నుండి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను దొంగతనంగా కరీంనగర్ తీసుకొని వస్తుండగా బొమ్మకల్ వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు అట్టి రెండు ట్రాక్టర్లను ఆపి తనిఖీ చేయగా వారి వద్ద ఎలాంటి ఇసుక రవాణా చేయుటకు అనుమతి లేకుండా ఉండగా అట్టి రెండు ట్రాక్టర్లను పంచనామా రాసి పోలీస్ స్టేషన్కు తీసుకొని వచ్చి అట్టి ఇద్దరి నేరస్తుల పై కేసు నమోదు చేయనైనది మరియు రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపించబడును మరియు ఇద్దరు నేరస్తులైన పిట్టల తిరుపతి మద్దెల శ్రావణ్ కుమార్ లను కోర్టుకు పంపించబడును ఇక నుండి ఎవరైనా ఇసుకను అనుమతి లేకుండా రవాణా చేసినట్లయితే వారిని రిమాండ్కు తరలించబడును మరియు వారిపై కఠినంగా చర్య తీసుకుంటామని కరీంనగర్ రూరల్ ఏ నిరంజన్ రెడ్డి ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అన్నాడు.



# వనపర్తి జిల్లాలో నవంబర్ 15 వరకు 'ఫ్రైడే ఫ్రైడే' కార్యక్రమాలు కొనసాగింపు

**వనపర్తి,అక్టోబర్ 22(ప్రజాస్వరం):**

వనపర్తి జిల్లాలో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో, ఆరోగ్య సంక్షేమంపై దృష్టి సారిస్తూ నవంబర్ 15వ తేదీ వరకు 'ఫ్రైడే ఫ్రైడే' కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఆభా కార్డుల జనరేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. అలాగే, వర్షాల నేపథ్యంలో డెంగ్యూ పరీక్షలు నిరంతరంగా కొనసాగించాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య పరీక్షల కోసం ఏఎన్ఎంలతో ఎన్సిడి స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మహిళల ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలను కూడా ప్రారంభించేందుకు సిద్ధమవ్వాలన్నారు. ఎంసీహెచ్ (మాతా శిశు ఆరోగ్య కేంద్రం) లో ప్రెజర్ ఆక్సిజన్, ఇంక్యుబేటర్ వంటి అత్యవసర వైద్య పరికరాల ఏర్పాటుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు, ప్రోగ్రాం అధికారులు సాయినాథ్ రెడ్డి, రామచంద్రరావు,ఇతర మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.




# బి సి రిజర్వేషన్ల బిల్లు కు ప్రభుత్వం కట్టుబడి ఉంది

- రంగారెడ్డి జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి

**షాబాద్,అక్టోబర్ 22(ప్రజాస్వరం):**

షాబాద్ మండల కేంద్రంలో బి సి లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కల్పించాలని గత 11 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్న బి సి లకు మద్దతు తెలుపుతూ రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కులగణన చేసిందన్నారు. బి సి లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సి ఎం రేవంత్ రెడ్డి గవర్నర్ కు లేఖ రాసినట్లు తెలిపారు. రిజర్వేషన్ల అమలులో బీజేపీ,బి ఆర్ ఎస్ పార్టీలు నాటకాలు చేస్తున్నాయని అన్నారు.బీసీ బిల్లు ఆమోదం పొందేవరకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ బి సి లకు కచ్చితంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీఇచ్చారు.ఆ తర్వాత ఎన్నికలకు వెళ్తామన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు అన్ని పార్టీలు కలిసి రావాలనీ పిలుపునిచ్చారు.సుప్రీంకోర్టు ఆదేశాలు బీసీ బిల్లుకు అనుగుణంగా ఉంటే ఎన్నికలు ప్రారంభమయ్యేవని అన్నారు.షాబాద్ మండలం నుంచి నా పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గుడ్డి మల్కాపూర్ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్,చేవెళ్ల సామి,మాజీ ఎంపీటీసీ గుండాల అశోక్,ఖాజా మియా,శ్రీనివాస్ గౌడ్, వెంకటయ్య,మాజీ సర్పంచ్ లు జనార్దన్ రెడ్డి,మహేందర్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తమ్మలి రవీందర్,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.





# వరిని సాగు చేసిన రైతులకు భరోసా



- కొనుగోలు కేంద్రాల్లో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలి
- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**వనపర్తి,అక్టోబర్ 22 (ప్రజాస్వరం):**

ఖరీఫ్ పంట సీజన్‌లో వరి కొనుగోలు ప్రక్రియ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరగాలన్న ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని వనపర్తి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం కొత్తకోట మండలంలోని పాలెం రైతు వేదికలో, అలాగే మదనాపూర్ మండల రైతు వేదికలో నిర్వహించిన మండల స్థాయి శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, వరి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "రైతులు కేంద్రాలకు వచ్చేటప్పుడు తడవుగా ఉండే పరిస్థితుల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా టార్పాలిన్ షీట్లు, నీడ కోసం షెడ్లు, తాగునీటి సౌకర్యం, గన్నీ బ్యాగులు వంటి అన్ని అవసరమైన మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉంచాలి" అని సూచించారు. కేంద్రము వద్ద ధాన్యం కొనుగోలు అయిన వెంటనే మిల్లులకు తరలించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. అలాగే సన్న మరియు దొడ్డు రకాల వరి ధాన్యాన్ని గుర్తించడంలో సిబ్బందికి స్పష్టమైన అవగాహన అవసరమని చెప్పారు. ధాన్యం కొలత, గ్రేడింగ్, మిల్లు తరలింపు తదితర అంశాల్లో పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. రైతుల నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తేనే ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లై డి.ఎం జగన్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వ్యవసాయ శాఖ అధికారులు, మండల తహసీల్దార్లు,రైతు సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు




# అవినీతి లేని పాలనే లక్ష్యం

- **సంస్థాగత ఎన్నికల్లో యువత అవకాశం కల్పిస్తాం**
- **తెలంగాణ ప్రజా రాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలకరి రవికుమార్**

**మెదక్, అక్టోబర్ 22 (ప్రజా స్వరం) :**

అవినీతి రహిత పాలన ఏర్పాటే తెలంగాణ ప్రజా రాజ్యం పార్టీ లక్ష్యం అని తెలంగాణ ప్రజా రాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలకరి రవికుమార్ అన్నారు. మెదక్ పట్టణంలోని ఆర్ అండ్ బి వసతి గృహంలో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అనేక త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణ అనేక అంశాల మీద వెనుకబడి ఉన్న తెలంగాణ గ్రామాల వారిగా అభివృద్ధి చెందాడానికి తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ 2000 సంవత్సరంలో ఆవిర్భవించిందన్నారు. కేంద్రంలో ఓ పార్టీ రాష్ట్రంలో ఓ పార్టీ ఉన్న స్థానిక అభివృద్ధి జరగకపోవడం తో ప్రజలను చైతన్యవంతం చేయడానికి టిపిఆర్పి కంకణ బద్ధులమవుతున్నామన్నారు. సంస్థాగత ఎన్నికల్లో యువతకు అవకాశం కల్పించి అవినీతి రహిత పాలన కొనసాగించడానికి ప్రయత్నం కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దాసరి శ్యామ్ రావు, సీనియర్ నాయకులు రిటైర్డ్ ఐఏఎస్ కునమనేని హరిప్రసాద్, డాక్టర్ సింగం శ్రీనివాస్ రావు, రాష్ట్ర మహిళా విభాగం నాయకులు ఉదయ కుమారి, విజయా రెడ్డి, ప్రొఫెసర్ సయ్యద్ జలాల్ తదితరులు పాల్గొన్నారు.

# కంటి శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి




- **ఎంపీడీవోలు వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశం**

**వికారాబాద్, అక్టోబర్ 22(ప్రజా స్వరం):**

జిల్లాలో ప్రజలకు కంటి వ్యాధి ,కంటి పొరలకు సంబంధించి కంటి స్క్రీనింగ్ చేయడానికి శంకర్ నేత్రాలయము హైదరాబాద్ వారు ముందుకొచ్చారని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారము వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి జూమ్ సమావేశము నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో అన్ని మండలాలో ఎంపీడీవోలు ,మెడికల్ అధికారులు కలిసి మెడికల్ క్యాంపు నిర్వహణకు చర్యలు చేపట్టాలని సూచించారు. క్యాంపు నిర్వహణకు లొకేషన్ గుర్తించడం, కంటి చూపు తక్కువ ఉన్నవారిని , మరియు కంటి వ్యాధి తో బాధ పడుతున్న వారిని క్యాంపుకు తీసుకురావడం , క్యాంపు నందు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడము పై పలు సూచనలు చేశారు. పి ఎచ్ సి లలో మరమ్మత్తు పనులు పూర్తి అయ్యాయా, పెండింగ్ ఏమైనా ఉన్నాయని పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే లబ్దిదారులకు ఉపాది హామీ పథకం క్రింద 90 రోజులు పని దినాలు కల్పించాలని, ఎస్ బి ఎం క్రింద ఒక మరుగు దొడ్డి మంజూరు చేయాలనీ అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా బ్యాంకుల ద్వార ఒక లక్ష రూపాయలు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు అప్పుగా ఇంప్పించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థ లు సుదీర్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్ , డి ఏం అండ్ ఎచ్ ఓ పవిత్ర, వివిధ మండలాల ఎంపీడీవోలు, ఏపిఓ లు, ఎపిఎం లు , మెడికల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు తదిరులు ఉన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు





- **కొనుగోలు సెంటర్ లోనే ధాన్యాన్ని విక్రయించాలి**
- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**
- **ఉపాధ్యాయుడుగా మారిన కలెక్టర్**

**మెదక్, అక్టోబర్ 22 (ప్రజా స్వరం) :**



కౌడిపల్లి మండల వెల్మ కన్నె గ్రామంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి, ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రన్నీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లా వ్యాప్తంగా 498 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో దాదాపు 100 కేంద్రాల్లో దాన్యం రావడం మొదలైంది అన్నారు. కేంద్రాల దగ్గర రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నారని అందులో మాయిచ్చరైన ధాన్యానికి టోకెన్ అందిస్తున్నామని తెలిపారు. టోకెన్ అందించడంతో పాటు మిల్లులకు కూడా ట్యాగింగ్ ఇచ్చేస్తున్నామన్నారు. ధాన్యం సరఫరాకు వాహనాలన్నీ సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు బిల్లులు త్వరగా చెల్లించేందుకు కూడా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రామాయంపేట మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రవాణా అవుతుందని తెలిపారు. రైతులు దళారులను నమ్మి రైతులు మోస పోవద్దని,ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్ లోనే ధాన్యాన్ని విక్రయించాలని వెల్లడించారు. మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన గుణాత్మక విద్యకు సోపానాలని, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద పిల్లలందరూ కూడా నాణ్యమైన విద్యద్వారా అభివృద్ధి పథంలోకి రావాలని దానికి ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందని, కావున విద్యార్థులకు లెక్కలు, ఆంగ్లం మీద పట్టు సాధించే విధంగా తర్ఫీది ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులతో 30 నిమిషాల సేపు పాఠ్యాంశాలపై వివిధ ప్రశ్నలు అడగడం వారితో ముచ్చటించడం జరిగింది. ఉపాధ్యాయిని పది నిమిషాలు పాఠం చెప్పించి తర్వాత ఆమెను అభినందించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి, చిన్నారులకు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రం అమలు చేస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకుని, చిన్నారుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. గ్రామానికి ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, గ్రామంలో ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని, అవి ఏ ఏ దశలల్లో ఉన్నాయని తెలుసుకున్నారు. ఇప్పటి వరకు అయినంత వరకు లబ్ధిదారుల అకౌంట్ కి డబ్బులు వచ్చాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు అన్ని బిల్లులు వచ్చాయా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు

- **కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి**
- **అధికారులకు జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశం**

**వికారాబాద్, అక్టోబర్ 22(ప్రజా స్వరం):**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లో సమావేశ మందిరంలో వానాకాలం (ఖరీఫ్) 2025 26 ధాన్యం కొనుగోలు పై సన్నాహక మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలు నీటి నిలువలు నిలిచే ప్రాంతాల్లో కాకుండా ఎత్తైన ప్రదేశాల్లో అన్ని రకాల వాహనాల రవాణాకు అనుకూలంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు అయిన కరెంటు, నీటి వసతి, కూర్చోవడానికి కుర్చీలు, టెంట్ వంటి వసతులు కల్పించాలని ఆయన సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో కేంద్రం పేరు మద్దతు ధర టోల్ ఫ్రీ నంబర్ తో కూడిన ఫ్లెక్సీ ని ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో సన్నధాన్యం, దొడ్డు ధాన్యం వేరువేరుగా కౌంటర్లను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. సన్నధాన్యం నింపుకునే గోనెసంచులపై 'S ' అనే అక్షరాన్ని తప్పనిసరిగా ముద్రించాలని ఆయన తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో సన్నధాన్యం దొడ్డు ధాన్యం వేరువేరుగా లారీలలో మిల్లులకు రవాణా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఏ గ్రేడ్ వరి ధాన్యానికి రూ. 2389 , సాధారణ రకం ధాన్యానికి రూ. 2369 మద్దతు ధరను నిర్ధారించడం జరిగిందని అలాగే సన్న ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయలు చొప్పున అదనంగా బోనస్ చెల్లించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.



ప్రతి కొనుగోలు కేంద్రంలో తూనిక యంత్రాలతో పాటు ధాన్యం శుభ్రపరిచే, తేమ శాతం కొలిచే యంత్రాలను మరియు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులో చేర్చే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 135 కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయునట్లు , జిల్లాలో లక్ష 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు అంచనాలు వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక అధికారులను నియమించడం జరుగుతుందని అదేవిధంగా మండల స్థాయిలో కూడా ప్రత్యేక అధికారులు ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలించడం జరుగుతుందని ఆయన తెలిపారు. సన్నాహక మరియు శిక్ష కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం, జిల్లా సహకార అధికారి నాగార్జున, డీసీఎంఎస్ అధికారి శ్యాంసుందర్, వ్యవసాయ, ఐకెపి, పిఎసిఎస్ అధికారులు పాల్గొన్నారు.



# కొమురం భీం ఆశయాలు గొప్పవి

**శామీర్‌పేట, అక్టోబర్ 22, (ప్రజాస్వరం) :**

గోండు వీరుడు కొమురం భీం జయంతి సందర్భంగా సీనియర్ ఉద్యమ కారులు కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ శామీర్ పేట్ లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతు భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం అలుపెరుగని పోరాటం చేసి రజ కార్లను గడగడ లాడించిన వీరుడు కొమురం భీం అని అన్నారు. తెలంగాణలో నిజోడే ఘాట్ లో ఆయన చేసిన వీరోచిత పోరాట పటిమ చరిత్రలో నిలిచి పోతుందని అఫ్జల్ ఖాన్ తెలిపారు. గోండు ప్రజల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాటం చేసి చివరకు కుర్దు పటేల్ అనే వెన్ను పోటు దారుని కారణంగా తుది శ్వాస వదిలారని, ఆయన తెలంగాణ ప్రజల గుండెల్లో ఎప్పటికి గూడు కట్టుకుని ఉంటారని అఫ్జల్ ఖాన్ అన్నారు. ఆయన ఆశయాలను మరవరాదని అఫ్జల్ ఖాన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉపాధ్యాయులు పి నర్సింహా రెడ్డి, మహ్మద్ నిసార్ అహ్మద్ ఖాన్, రాజు, శన్ముఖ్ రావు, రాంబాబు, గణపతి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల సేవలు వెలకట్టలేనివి




- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**పరిగి, అక్టోబర్ 22(ప్రజా స్వరం) :**

పోలీస్ ఫ్లాగ్ డే పురస్కరించుకుని నేడు పరిగి పట్టణంలోని ఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో పరిగి సబ్ డివిజన్ పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ రామ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, పోలీస్ ఫ్లాగ్ డే అనేది మనందరికీ గర్వకారణమైన దినమని అన్నారు. "సమాజానికి రక్షణగా నిలిచి, విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన వీర పోలీసుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న నిస్వార్థ సేవ వెలకట్టలేనిది. ఈ పవిత్ర దినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం పోలీసుల సామాజిక బాధ్యతకు నిదర్శనం. రక్తదానం చేయడంలో పోలీసులు ముందుండడం ఎందరికో ఆదర్శం. ఈ రక్తదానం ద్వారా అనేక మంది నిరుపేదలకు, అత్యవసర వైద్యం అవసరమైన వారికి కొత్త జీవితం లభిస్తుంది. పోలీసు శాఖ ప్రజలకు మరింత చేరువ కావడానికి, వారిపై ప్రజలకు మరింత విశ్వాసం పెరగడానికి ఇలాంటి సేవా కార్యక్రమాలు దోహదపడతాయి. పరిగి నియోజకవర్గ ప్రజల తరపున పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పోలీస్ అధికారులను, స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్కరిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను," అని ఆయన అన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి రక్తదాతలను, పోలీస్ అధికారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ, "పోలీస్ ఫ్లాగ్ డే అనేది విధి నిర్వహణలో దేశం కోసం, ప్రజల శాంతి భద్రతల కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకునే పవిత్ర దినం. వారి స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు




చేశాము. రక్తదానం అనేది ప్రాణదానంతో సమానం. ఒక వ్యక్తి ఇచ్చే రక్తం మరొకరి ప్రాణాన్ని నిలబెడుతుంది. అత్యవసర సమయాల్లో, ప్రమాదాల్లో, వైద్య చికిత్సల్లో రక్తం అవసరం ఎంతో ఉంది. అలాంటి గొప్ప కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, అధికారులు, స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనడం అభినందనీయం" అని అన్నారు. పోలీస్ వ్యవస్థ నిత్యం ప్రజలకు అండగా ఉంటుందని, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు సామాజిక సేవ కార్యక్రమాలలో కూడా చురుగ్గా పాల్గొంటుందని ఎస్పీ తెలియజేశారు. ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ ప్రశంసించి, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాములు నాయక్, పరిగి సబ్ డివిజన్ డి.ఎస్ పీ శ్రీనివాస్, పరిగి సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది, రక్తదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

- ప్రిన్సిపాల్ సెక్రటరీ లోకేష్ కుమార్

**వికారాబాద్, అక్టోబర్ 22(ప్రజా స్వరం):**



జిల్లాలో భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను అన్ని మాడుల్స్ లో పరిశీలించి పూర్తి చేయాలని ప్రిన్సిపాల్ సెక్రటరీ లోకేష్ కుమార్ అదనపు కల్లెక్టర్లకు ఆదేశించారు. బుధ వారం హైదరాబాద్ నుండి జిల్లా అదనపు కల్లెక్టర్లకు వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్సు లో అయన మాట్లాడుతూ జిల్లా లో రెవెన్యూ సదస్సుల ద్వార వచ్చిన భూ భారతి ద్వార వచ్చిన దరఖాస్తులను పూర్తి స్థాయి లో పరిశీలించి ఆన్ లైన్ లో డేటా ఎంట్రి చేయాలని, గ్రామాలవారిగా రైతుల నుండి తీసుకున్న ప్రతి దరఖాస్తుకు సంబంధించి సాధా బైనామా, ఆర్ఓఆర్ సమస్యలు, పట్టాలో కరెక్షన్స్ వంటి వివిధ సమస్యల పై దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పూర్తి అయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. భూ భారతి రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన పెండింగ్ దరఖాస్తులను పరిష్కారం కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రెవెన్యూ సదస్సులు, భూభారతిలో వచ్చిన అప్లికేషన్లను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్సు లో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్ డి ఓవాసు చంద్ర, సెక్షన్ సుపరింతెన్డెంట్లు దీపక్, మున్నీర్ , ఇ డి ఏం మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# బేగంపేట, దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్




- విద్యార్థులకు చట్టాలు, పోలీస్ విధులపై అవగాహన

**దౌల్తాబాద్, అక్టోబర్ 22 ప్రజాస్వరం :**

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ డే కార్యక్రమాల లో భాగంగా బేగంపేట, దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు పోలీస్ స్టేషన్ కార్యకలాపాలు, కేసులు నమోదు విధానం, నేరస్తులను పట్టుకోవడం, ప్రజల ప్రాణ ధన రక్షణకు పోలీసులు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. అదేవిధంగా మహిళల, పిల్లల రక్షణకు ఉన్న చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలు, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల హానికర ప్రభావాలు, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. అదనంగా పోలీస్ స్టేషన్లలోని వివిధ విభాగాలు, సీసీ కెమెరాల ఫంక్షనింగ్, డయల్ 100 సేవ, బ్లూ కోర్స్, పెట్రోల్ కార్ పనితీరు, పోలీసుల విధులు, ఆధునిక టెక్నాలజీ వినియోగం, సీఈఆర్ ద్వారా మొబైల్ రికవరీ, కమ్యూనికేషన్ విహెచ్ఎఫ్ సెట్ వినియోగం వంటి అంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాలలో ఎస్ఐలు మహిపాల్ రెడ్డి, అరుణ్ కుమార్ ఇతర పోలీస్ సిబ్బంది విద్యార్థులకు చట్టాలు, పోలీస్ విధులపై స్పష్టమైన అవగాహన కల్పించారు. విద్యార్థులు పోలీస్ పనితీరును ప్రత్యక్షంగా చూసి ఆనందం వ్యక్తం చేశారు.




# ఘనంగా సిద్ధార్థ పుట్టినరోజు వేడుకలు

**శామీర్‌పేట, అక్టోబర్ 22(ప్రజాస్వరం) :**

ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయ సమీపంలో ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన మూడు చింతలపల్లి మున్సిపల్ ఉద్దమర్రి గ్రామపంచాయతీ కార్యదర్శి మోహన్ సింగ్ కుమారుడు సిద్ధార్థ పుట్టినరోజు వేడుకలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్, ఉద్దమర్రి గ్రామశాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తునికి వెంకటేష్, నాయకులు బస్వరెడ్డి, నారాయణపూర్ గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్, వెంకట్ రెడ్డి, బలరాంరెడ్డి, నల్ల ప్రభాకర్ రెడ్డి, సురేష్, సంతోష్, వెంకటేష్, ఆకుల నగేష్, కిరణ్, నవీన్ చారి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల ప్రారంభం

**దౌల్తాబాద్, అక్టోబర్ 23 ప్రజాస్వరం :**

దౌల్తాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని దీపాయంపల్లి, శేర్‌పల్లి బందారం, గాజులపల్లి, దొమ్మాట గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ, రైతులు పండించిన పంటను దళారులకు విక్రయించకుండా, ప్రభుత్వ నిర్ణయించిన కనీస మద్దతు ధర (MSP) వద్దనే సొసైటీ ద్వారా అమ్మాలని సూచించారు. రైతుల శ్రమకు న్యాయం జరిగే విధంగా పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ సంకల్పం నెరవేరుతుందని తెలిపారు. ఈ ప్రారంభో



త్సవ కార్యక్రమానికి దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రైతులతో మాట్లాడనున్నారు. రైతుల సంక్షేమమే తమ లక్ష్యమని, పంట కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్లు మల్లేశం వెల్లడించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**దౌల్తాబాద్ అక్టోబర్ 22 ప్రజాస్వరం :**

మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు గారి ఆదేశాల మేరకు సూరంపల్లి గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చామంతి రాజు వారి కుమార్తె చామంతి శ్రీలేఖకు రూ. 9,000 విలువైన చెక్కును గ్రామ బూత్ అధ్యక్షులు తైల కుమార్, దుబ్బాక నియోజకవర్గ మంకీ బాత్ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, గ్రామ మాజీ ఉప సర్పంచ్ బొల్లం స్వామి కలిసి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ – "గ్రామ ప్రజల్లో ఎవరికైనా పెద్ద కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారు ఉంటే, వారి ఆసుపత్రి బిల్లులను



మన సూరంపల్లి బీజేపీ కార్యకర్తలకు అందజేయండి. ఆ బిల్లులను మన మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ (CMRF)కి సమర్పించి, సంబంధిత లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తాం," అని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా నాయకులతో పంచుకోవాలని, ప్రభుత్వ పథకాల ద్వారా అందించే సహాయాలను సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తోడంగి రాజు, కడారి శంకర్, తలారి శ్రీకాంత్, కడారి పెద్దోళ్ల ఎల్లం, జంగపల్లి స్వామి గౌడ్, చామంతి స్వామి, కేసోల్ల నర్సింలు, కేసోల్ల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# తిర్మలాపూర్‌లో చెక్కుల పంపిణీ



**దౌల్తాబాద్, అక్టోబర్ 22 ప్రజాస్వరం :**

దౌల్తాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ (CMRF) చెక్కులను దుబ్బాక శాసన సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎంపీటీసీ ల ఫోరం అధ్యక్షుడు బండారు దేవేందర్, మాజీ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు సరుగారి యాదవ్ రెడ్డి గార్ల చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కొంతమంది అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన నేపథ్యంలో, వారి వైద్య ఖర్చులను తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేసిందని తెలిపారు. లబ్ధిదారులు కరికే రాణి రూ.17,000, నక్క శాంతమ్మ రూ.7,500, కరికే రాజమణి రూ.12,500, గొల్ల సత్తవ్వ రూ. 29,000, బండారు బాలవ్వ రూ. 22,000, మొత్తం రూ. 88,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, వికలాంగుల సంఘం అధ్యక్షుడు నర్సింలు, శ్రీకాంత్, చంద్రయ్య, వెంకట్ రెడ్డి, లక్ష్మినర్సింహస్వామి, నాగరాజు, రమేష్, స్వామి, యాదవ్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, కనరాజు, పోచయ్య, నర్సింలు, వెంకట్ పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన రద్దుకు రంగం సిద్ధం

- స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపునకు వేగంగా అడుగులు
- నేటి కేబినెట్ సమావేశంలో తుది నిర్ణయానికి అవకాశం
- ఆర్డినెన్స్ ద్వారా చట్ట సవరణ చేయనున్న తెలంగాణ ప్రభుత్వం
- గవర్నర్ ఆమోదిస్తే రానున్న పంచాయతీ ఎన్నికల్లోనే అమలు
- ఇప్పటికే మంత్రి సీతక్క సంబంధిత ఫైల్‌పై సంతకం

**తెలంగాణ బ్యూరో అక్టోబర్ 22(ప్రజాస్వరం):**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారికి ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్నవారు అనర్హులు అనే 30 ఏళ్ల నాటి నిబంధనను తొలగించేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు గురువారం జరగనున్న కేబినెట్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుని, ఆర్డినెన్స్ జారీ చేయాలని భావిస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయితే, రానున్న పంచాయతీ ఎన్నికల నుంచే ఈ కొత్త విధానం అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాలు ప్రస్తుతం జరగడం లేదు. ఈ నేపథ్యంలో చట్టసవరణను ఆర్డినెన్స్ రూపంలో తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయతీరాజ్, పురపాలక శాఖలు ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేశాయి. మంత్రి సీతక్క ఈ ఫైల్‌పై సంతకం చేయగా, సీఎం రేవంత్ రెడ్డి ఆమోదం తర్వాత దీనిని కేబినెట్ ముందుకు తీసుకురానున్నారు. మంత్రివర్గం ఆమోదించిన వెంటనే, ముసాయిదా ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదానికి పంపిస్తారు.




గవర్నర్ ఆమోద ముద్ర వేస్తే, పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉన్నవారు కూడా పోటీ చేసేందుకు మార్గం సుగమం అవుతుంది. కుటుంబ నియంత్రణను ప్రోత్సహించే లక్ష్యంతో ఉమ్మడి ఏపీలో 1995లో ఈ నిబంధనను ప్రవేశపెట్టారు. దాదాపు మూడు దశాబ్దాలుగా ఇది అమల్లో ఉంది. అయితే, రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు, కుటుంబ నియంత్రణపై ప్రజల్లో పెరిగిన అవగాహన, ప్రజల నుంచి వస్తున్న వినతులను పరిగణనలోకి తీసుకుని ఈ నిబంధనను ఎత్తివేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గత సంవత్సరం ఏపీలో కూడా ఇదే తరహా చట్టసవరణ చేశారు. ఈనెల 16న జరిగిన మంత్రివర్గ సమావేశంలో సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం, ఇప్పుడు దానిని ఆచరణలో పెట్టేందుకు కసరత్తు పూర్తి చేసింది.

## గాలి కుంటు వ్యాధి నివారణ పశు వైద్య శిబిరాలు విజయవంతం



- ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు

**ఖమ్మం,అక్టోబర్ 22(ప్రజాస్వరం):**

ముదిగొండ మండలంలో బుధవారం పమ్మి, సువర్నాపురం,న్యూ లక్ష్మీపురం గ్రామాలలో జాతీయ పశు వ్యాధుల నివారణలో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధినివారణ శిబిరాలు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బి శ్రీనివాస్ రావు, మండల వైద్యాధికారి డాక్టర్ అశోక్ నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని గ్రామాలలో వైద్య బృందాలతో పశుపోషకులు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా చేయించాలని గాలికుంటు అంటువ్యాధి సోకిన పశువులు అధిక జ్వర తీవ్రతతో నోట్లో పొక్కులు పుండ్లుగా మారి నొప్పి వలన మేత మరియు నీరు తీసుకోకుండా నీరసించి పోతాయి ఎడ్లు వ్యవసాయ పనులకు సహకరించలేవని కావున ముందు జాగ్రత్తగా ప్రతి ఒక్కరూ తమ పశువులకు టీకాలు వేయించాలని తెలిపారు వ్యాధి సోకకుండా పశువుల పాకలను ప్రతిరోజు శుభ్రపరిచి అపరిశుభ్రంగా లేకుండా చూసుకోవాలని తెలిపారు అనంతరం జిల్లా పశు వైద్య మరియు పశు సంవర్ధక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీలో భాగంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో పశువులకు టీకాలు పూర్తి చేయాలని సూచించారు.




## జర్నలిస్టుల సంక్షేమం కోసం మాటలు చెప్పడం కాదు చేతల్లో చేసేదే టీయూడబ్ల్యూజే (ఐజేయు)

- యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ సలీమ్ పాషా, కార్యదర్శి మేకల సత్యనారాయణ లు స్పష్టం
- జర్నలిస్టుల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ కోసం హెల్త్ క్యాంపులు నిర్వహణ
- భవిష్యత్ లో జిల్లా అంతా దశల వారీగా హెల్త్ క్యాంపులు చెపడతామని నాయకుల వెల్లడి




**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 22(ప్రజాస్వరం):**

జర్నలిస్టుల సంక్షేమానికి మాటాల్లో కాకుండా చేతల్లో చూపేది టీయూడబ్ల్యూజే ఐజేయూ మాత్రమేనని నిరూపిస్తూ జర్నలిస్టుల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ కోసం హెల్త్ క్యాంపు లు నిర్వహిస్తున్నట్లు యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ సలీమ్ పాషా, కార్యదర్శి మేకల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు మొగిలి నరసింహ, హెల్త్ క్యాంపు కన్వీనర్ ఆర్.శేఖర్ లు తెలిపారు. ఎల్ బి నగర్ నియోజకవర్గంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఈ నెల 23 న మాస్టర్ హెల్త్ చెకప్ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. చైతన్య పురి లోని లిఖిత దయాగ్నస్టిక్ లో మొట్టమొదటగా ఎల్ బీ నగర్ నియోజకవర్గ జర్నలిస్టుల కోసం లిఖిత దయాగ్నస్టిక్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్ లో జిల్లా అంతా చెపడతామన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపీ ఇటేల రాజేందర్, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గరపు దయా నంద గుప్తా, మాజీ ఎంపీ మధు యాస్కి, రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి, ఐజేయు జాతీయ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, కార్యదర్శి కే శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర మఫిసిల్ కమిటీ కన్వీనర్ పేపర్ శ్రీనివాస్, జాతీయ కౌన్సిల్ సభ్యులు ప్రవీణ్ కుమార్, కార్పొరేటర్ రంగ నరసింహ గుప్తా, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీశైలం, శ్రీనివాస్ తదితరులు ముఖ్య అతిధులుగా హాజరవుతారని తెలిపారు.

## చట్టపరంగానే ఇవ్వాలి పార్టీలపరంగా వద్దే వద్దు: అర్.కృష్ణయ్య

**విద్యానగర్ అక్టోబర్ 22(ప్రజాస్వరం):**



బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టపరంగానే ఇవ్వాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు అర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు ఇచ్చే కోటాతో బడుగులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానించారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రికి ఆయన ఒక లేఖ రాశారు. గురువారం జరిగే కేబినెట్ భేటీలో స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన స్పష్టత ఇవ్వాలని కోరారు. పార్టీ పరంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే ఆలోచనలు ప్రభుత్వం చేస్తున్నట్టు తమకు సమాచారం ఉందని చెప్పిన ఆయన ఈ తరహా వాటాతో బలహీన వర్గాలకు సరైన న్యాయం జరగదని అభిప్రాయపడ్డారు. ఎవరి భిక్షం వద్దని, చట్టబద్ధంగానే బిసిల జనాభా ఎంతో అంతా వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల అంశం కోర్టులో పరిధిలో ఉందని, మరో రెండు నెలల్లో తీర్పు రానుండగా తొందరపాటు నిర్ణయాలు ఎందుకని ప్రశ్నించారు. బిసి సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన జరిగిన రాష్ట్ర బంద్ చారిత్రాత్మకమని, అన్ని పార్టీలు, అన్నివర్గాలు బంద్‌కు మద్దతు ఇచ్చాయని గుర్తు చేశారు. బిసిల డిమాండ్ న్యాయమైనదని, బంద్ తీవ్రతను పాలకులు గుర్తించాలన్నారు. స్థానిక సంస్థలలో బిసిలకు ఇచ్చిన రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధమైన చట్టబద్ధత, న్యాయబద్ధత ఉందని అన్నారు. ఆర్టికల్ 243 డి6 ప్రకారం రిజర్వేషన్లు నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. జనాభా లెక్కలు తీసి అసెంబ్లీలో చట్టం చేసినందున, వాస్తవాలను న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్ళే ప్రయత్నం చేయాలని సూచించారు. గతంలోనూ సుప్రీంకోర్టు అనేక తీర్పులలో జనాభా లెక్కలు ఉంటే రిజర్వేషన్లు పెంచవచ్చని చెప్పినందున 42 శాతం చట్టబద్ధ రిజర్వేషన్ల కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో ముఖ్యమంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు.



## నవంబర్ 1న చలో హైదరాబాద్ " దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన"

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ

**హైదరాబాద్ అక్టోబర్ 22(ప్రజాస్వరం):**

బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయి పై పాశవిక దాడి చేసిన దుండగుడుపై ఇప్పటివరకు కేసు నమోదు కాకపోవడాని తీవ్రంగా ఖండించారు. వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని, అస్తిత్వాన్ని కాపాడే విధంగా నవంబర్ 1న హైదరాబాదులో లక్షలాది మందితో దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనను నిర్వహిస్తాం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, ఎంఎస్ఎఫ్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## ఇరుముడితో 18 మెట్లెక్కిన రాష్ట్రపతి

**హైదరాబాద్ అక్టోబర్ 22(ప్రజాస్వరం):**

శబరిమలలో అయ్యప్పస్వామిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దర్శించుకున్నారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఆమె అక్కడికి వెళ్లారు. పంబానుంచి సన్నిధానం వరకూ తన అత్యవసర వాహనంలో ప్రయాణించారు. అనంతరం ఆలయ పవిత్రత, ఆచారాలు, సంప్రదాయాల ప్రకారం ఆమె అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. ఇరుముడితో 18 మెట్లెక్కి ఆలయ ఆచారాలు, తాంత్రిక నియమాలకనుగుణంగా స్వామి వారికి రాష్ట్రపతి ముర్ము పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను రాష్ట్రపతికి శబరిమల ప్రధాన అర్చకుడు, ఇతర ఆలయ అధికారులు అందజేశారు. అయ్యప్ప సేవలో పాల్గొన్న తొలి మహిళగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిలవడం విశేషం.

## ఘట్కేసర్ కాల్పుల ఘటనపై ఈటల రాజేందర్ ఆగ్రహం

**సికింద్రాబాద్ అక్టోబర్ 22(ప్రజాస్వరం):**



ఘట్కేసర్ వద్ద గోవులను తరలించడాన్ని అడ్డుకోవడంతో గాయపడిన గోరక్షకుడు సోను (ప్రశాంత్) ను సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, మీడియాతో మాట్లాడుతూ గోరక్షకులపై దాడులు పెరుగుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం గోవులను తరలించే గుండాలను కాపాడుతోందని ఆరోపించారు. ప్రశాంత్‌పై కాల్పులు జరిపిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రైతుల ఉసురు తీసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి

**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 22(ప్రజాస్వరం):**



మొక్కజొన్న రైతులు దళారుల బారిన పడుతున్నారు. మొక్కజొన్నకు మంచి గిరాకీ ఉండడంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 80వేల ఎకరాల్లో రైతులు సాగు చేసారు. మొక్కజొన్న పశువులు, కోళ్ల దాణాకు ఎక్కువగా వినియోగించడంతో ఎక్కవ డిమాండ్ ఉండడం వల్ల జిల్లా వ్యాప్తంగా మెట్టు, వర్షాధారంగా సాగు చేస్తున్న పల్లం భూములలో మొక్కజొన్నను రైతులు సాగు చేస్తున్నారు.కప్పాటి పాండురంగా రెడ్డి రంగారెడ్డి జిల్లా జాగృతి అధ్యక్షులు రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ వారు మాట్లాడుతూ వారం రోజుల క్రితం నుంచి కోత దశకు రావడంతో రైతులు మొక్కజొన్న కోసేసి నూర్పిడి చేసే పనుల్లో బిజీగా ఉన్నారు. వర్షాలు కురవడంతో నిల్వ చేసుకునేందుకు అవకాశం లేకపోవడంతో రైతులు కల్లంలోనే పంటను వ్యాపారాలు, రైతులకు అమ్మేస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న దళారులు, వ్యాపారాలు తక్కువ ధరకు కొనుగోలు చేసి నిలువునా రైతులను దోపిడీ చేస్తున్నారు. మొక్కజొన్నకు ప్రభుత్వం గిట్టు బాటు ధర రూ. 2,300 ప్రకటించింది. అయినప్పటికీ కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కెంద్రాలు ఏరాటు చేయకపోవడం తో దళారులు, వ్యాపారులు క్వింటాలు మొక్కజొన్న రూ. 1900 నుంచి రూ. 2వేలు వరకు కొనుగోలు చేసి డబ్బలకు వాయుదాలు వేస్తూ రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులకు పెట్టుబడులు కూడా రావడం లేదని. నిల్వ చేసేందుకు అవకాశం లేకపోవడం వల్లకూడా దళారులకు అమ్మేస్తున్నారు అన్నారు. రైతుభరోసా, రుణమాఫీ ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలకు సమయానికి విత్తనాలు, ఎరువులు కూడా ఇవ్వలేకపోయింది.. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయలేకపోతోంది.. రాజకీయ ప్రయోజనాలు తప్ప ప్రజల వ్యథలు పట్టించుకోని ఈ ప్రభుత్వానికి ప్రజల చేతిలో గుణపాఠం తప్పదు. ఇప్పటికైనా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 2,400 మద్దతు ధరతో కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేసారు



## నాచగిరి లక్ష్మి నరసింహా స్వామి గిరి ప్రదక్షిణం

- గిరి ప్రదక్షిణం ప్రారంభించిన రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి
- గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు
- హాజరైన భక్తులు అయ్యప్ప మాల దారులు ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు

**మెదక్ జిల్లా అక్టోబర్ 22(ప్రజాస్వరం):**

ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా గిరి ప్రదక్షిణను రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి ప్రారంభించారు. రెండోసారి ప్రదక్షిణలో పాల్గొని భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.ఈ సందర్భంగా రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారు మాట్లాడుతూ... కార్తీక మాసంలో రెండుసార్లు గిరి ప్రదక్షిణ రావడం భక్తుల అదృష్టం అని అన్నారు. గిరి ప్రదక్షిణలో పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు చుట్టుపక్క ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి మాలదారులు ధర్మ పరిరక్షణ కమిటీ సభ్యులు స్వామివారి భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం స్వామివారి పురవీధులలో " శ్రీ లక్ష్మీనృసింహ " నామస్మరణతో ర్యాలీ నిర్వహించగా విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలను చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్తా,ఈవో విజయరామారావు,అర్చక సిబ్బంది పర్యవేక్షిస్తూ విజయవంతంగా ముందుకు నడిపించారు.ఈ గిరిప్రదక్షిణ లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి గజ్వేల్ నియోజకవర్గ భారాస ఇన్చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి అలాగే అఖిలపక్ష నాయకులు తాజా మాజీ జడ్పీటీసీలు ఎంపీపీలు ఎంపీటీసీలు తూప్రాన్ మున్సిపల్ మాజీ చైర్మన్లు కౌన్సిలర్లు తాజా మాజీ సర్పంచులు ఉపసర్పంచులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిలిచిన మధ్యాహ్న భోజన బిల్లులు

- అయోమయంలో కార్మికులు
- ప్రభుత్వం తక్షణం బకాయిలు విడుదల చేయాలని డిమాండ్



**దౌల్తాబాద్, అక్టోబర్ 22 ప్రజాస్వరం :**
మండలంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కింద పనిచేస్తున్న కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఆరు, యుపిఎస్ మూడు, తెలంగాణ మోడల్ స్కూల్‌తో కలిపి మొత్తం 35 పాఠశాలలకు సంబంధించిన మధ్యాహ్న భోజన కార్మికులకు 30 సెప్టెంబర్ నాటికి సుమారు రూ.22 లక్షల బకాయిలు ప్రభుత్వం చెల్లించవలసి ఉంది. అయితే అక్టోబర్ నెల 23వ తేదీ వరకు గడిచినప్పటికీ ఇప్పటికీ పాత బకాయిలు విడుదల చేయకపోవడంతో కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల్లో డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. "మేము ప్రతి రోజూ పిల్లలకు ఆహారం వండుతూ సేవ చేస్తున్నాం. కానీ నెలల తరబడి బిల్లులు ఇవ్వకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు తీవ్రంగా పెరిగాయి," అని పలువురు కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణం స్పందించి పాఠశాలలకు రావలసిన బకాయిలను విడుదల



చేసి, కార్మికుల కష్టాలను నివారించాలని వారు డిమాండ్ చేశారు.

# కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ దరఖాస్తుకు ఆహ్వానం

- మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి

**దౌల్తాబాద్, అక్టోబర్ 23 ప్రజాస్వరం :**
మండల కేంద్రంలో కేజీబీవి పాఠశాలలో అసిస్టెంట కుక్ పోస్టు ఖాళీగా ఉంది.అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి తాత్కాలిక ప్రతిపాదికన భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని రాయపోల్ మండల విద్యాశాఖ అధికారి ఏ. సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలలో అసిస్టెంట్ కుక్ గా పనిచేసేందుకు స్థానికులైన మహిళలకు ఏడవ తరగతి చదివిన వారై, 360 మందికి వంట చేయగల సామర్థ్యం కలిగి అనుభవం కలిగిన వారు అర్హులని తెలిపారు. ఈ పోస్టు గాను రాయపోల్ మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలలో ఈ నెల 23 తేదీ నుంచి 27 వ తేదీ లోపు దరఖాస్తుతో పాటు పాస్ ఫోటో ,ఆధార్ కార్డ్ మరియు అనుభవం గల ధ్రువీకరణ పత్రాలు జతపరిచి కేజీబీవీ పాఠశాల



యందు స్పెషల్ ఆఫీసర్ కు అందజేయాలని పేర్కొన్నారు. అనంతరం ఇంటర్వ్యూ డెమో నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పైన పేర్కొన్న తేదీలలో ఉదయం 10:00 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని మండల విద్యాధికారి తెలిపారు.

# గురుకులాల్లో దరఖాస్తుల స్వీకరణ

**కరీంనగర్, అక్టోబర్ 22 ప్రజా స్వరం :**
మండలం ఇరుకుల్ల తెలంగాణ మైనారిటీస్ గురుకుల పాఠశాల మరియు కళాశాల కరీంనగర్ బాలుర2లో 202526 విద్యా సంవత్సరానికి గాను 5 వ తరగతిలో మిగిలి ఉన్న ఎస్సీ 1, ఎస్టీ 1 సీట్ల భర్తీ కై దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కనపర్తి సురేష్ ఒక ప్రకటన లో తెలిపారు. కావున ఎస్సీ, ఎస్టీ కేటగిరిలకు చెందిన అభ్యర్థులు 27/10/2025 లోపు పాఠశాల యందు సంప్రదించాలని కోరారు. వీటితో పాటు 6,7,8,9, తరగతులలో మిగిలిన మైనారిటీ సీట్ల భర్తీకి కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9949116470 ఫోన్ నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

# మంత్రి వివేక్ vs హరీశ్



**సిద్దిపేట, ప్రజాస్వరం :**
సిద్ధిపేటలో జరిగే కళ్యాణాలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఈసారి రాజకీయ వాతావరణంతో మారింది. కార్యక్రమంలో మంత్రి వివేక్ , మాజీ మంత్రి హరీష్ రావు మధ్య మాటల యుద్ధం నెలకొంది. మంత్రి వివేక్ బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, పదేళ్లలో ఒక్క రేషన్ కార్డును కూడా ఇవ్వలేదని విమర్శించారు. దానికి ప్రతిస్పందనగా, హరీష్ రావు స్పందిస్తూ.. "మా పాలనలో 6.50 లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం. కాదని నిరూపిస్తే, ఇక్కడే రాజీనామా చేస్తా" అని సవాల్ విసిరారు. మంత్రి వివేక్ చనిపోయిన కుటుంబాలకు మాత్రమే రేషన్ కార్డులు ఇచ్చారని, కొత్తవారికి ఇవ్వలేదని జవాబు ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు కూడా ప్రశ్నలతో ముందుకొచ్చారు. ఒక మహిళ మంత్రి వివేక్‌ను "తులం బంగారం ఎప్పుడిస్తారు?" అని అడగ్గా.. BRS పార్టీ డబుల్ బెడ్ రూమ్ కట్టించిందా అని మరో ప్రశ్న సంధించారు వివేక్.. దీంతో.. హరీష్ రావు డబుల్ బెడ్ రూం ఇల్లు ఇచ్చారని చెప్పింది మహిళ.. ఈ ప్రశ్నలకు మంత్రి వివేక్ సమాధానం ఇవ్వలేకపోయారు. ఈ సంఘటన ద్వారా, చెక్కుల పంపిణీ కార్యక్రమం సాధారణ వేడుకగా కాకుండా, రాజకీయ వాదనల వేదికగా మారింది. రాజకీయ నాయకుల మాటల యుద్ధం, స్థానికుల ప్రత్యక్ష స్పందనలు ఈ వేడుకలో స్పష్టంగా కనిపించాయి.



# శ్రీ గాయత్రీ మహా క్షేత్రంలో కార్తీక మాస ప్రత్యేక పూజలు

**శామీర్‌పేట, అక్టోబర్ 22(ప్రజాస్వరం) :**
శ్రీ గాయత్రీ మహా క్షేత్రంలో ఉమామహేశ్వర స్వామికి కార్తీకమాస ప్రత్యేక పూజలు బుధవారం నిర్వహించారు. శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ గాయత్రీ మాక్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా ఉమామహేశ్వర స్వామికి ఆలయ వ్యవస్థాపకులు, వాక్ బ్రహ్మ, డాక్టర్ ఎస్ వి ఎల్ ఎల్ మూర్తి ఆధ్వర్యంలో అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఉమ్మడి శామీర్ పేట మండలంలోని శైవ క్షేత్రాలలో కార్తీకమాస సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ భక్తులు, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.



# మూసారాంబాగ్ బ్రిడ్జి కూల్చివేత

**హైదరాబాద్, ప్రజాస్వరం :**
మూసారాంబాగ్ ప్రాంతంలో పాత బ్రిడ్జిని కూల్చివేయడానికి జీహెచ్‌ఎంసి అధికారులు చర్యలు చేపట్టారు. అయితే, కొత్త హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం ఇంకా పూర్తికాకముందే పాత బ్రిడ్జిని కూల్చివేయడం స్థానికుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. గతంలో వచ్చిన వరదలలో దెబ్బతిన్న ఈ బ్రిడ్జి, ఇంజనీరింగ్ విభాగం ప్రకారం వాహనాల రాకపోకలకు సురక్షితం కాదని తెలుసుకున్నప్పటికీ, స్థానికుల అభ్యర్థనలను పక్కన పెట్టి ఈ నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. స్థానికులు చెప్పుతున్నదాని ప్రకారం.. అంబర్‌పేట్ నుంచి దిల్సుఖ్‌నగర్ వరకు గల ప్రత్యామ్నాయ మార్గం గోల్నాక బ్రిడ్జి మాత్రమే ఉంది. పాత బ్రిడ్జి కూల్చివేతతో, 300 మీటర్ల దూరాన్ని 5 కిలోమీటర్లుగా నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం నడవడానికి తాత్కాలిక మార్గం కూడా ఏర్పాటు చేయకపోవడం ప్రజల్లో ఆగ్రహాన్ని పెంచుతోంది. కొత్త బ్రిడ్జి పూర్తి అయ్యాక పాత బ్రిడ్జిని కూల్చివేయడం, అందరిలోనూ సురక్షిత మార్గాలను ముందుగా ఏర్పాటు చేయడం. "పాత బ్రిడ్జి వద్ద పని జరుగుతోందన్నప్పటికీ, కనీసం నడవడానికి మార్గం ఇవ్వకపోవడం ఘోరం" అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకుముందు ప్రణాళికలో స్థానికుల అభ్యర్థనలు పరిగణలోకి తీసుకోవడం లేదని, 300 మీటర్లను ఐదు కిలోమీటర్లుగా నడవాల్సిన ఈ ఇబ్బందులు పరిష్కరించాల్సిన అవసరం ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం సమస్య మరింత ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయ్యే వరకు తాత్కాలిక మార్గాలను ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



## కలెక్షన్లు రాబడుతున్న

# డ్యూడ్

కొన్ని కాంబినేషన్ల కోసం చాలా సందర్భాల్లో ముమ్మరంగా ప్రయత్నిస్తూనే ఉంటారు. కానీ, అనుకున్నప్పుడు వర్కవుట్ కావు. కానీ, అనుకోని సందర్భాల్లో స్క్రీన్ మీద తళుక్కుమంటాయి. అలాంటి కాంబో డ్యూడ్ మూవీకి కుదిరిందని అంటున్నారు ప్రదీప్ రంగనాథన్. ఆయన హీరోగా నటించిన సినిమా 'డ్యూడ్'. మమిత బైజు హీరోయిన్‌గా నటించారు. ''డ్యూడ్‌లో నేను చేసిన కేరక్టర్ చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. అసలు ఇలాంటి రోల్ కెరీర్లో ఇంత ఎర్లీ స్టేజ్‌లో చేస్తానని నేను ఊహించనేలేదు. అందుకే ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాను. డైలాగులు కూడా రాత్రుళ్లు ఇంటికి తీసుకెళ్లి బట్టీపట్టేదాన్ని. నిద్రపోకుండా ప్రాక్టీస్ చేసేదాన్ని. లైన్స్ గుర్తుంటే కెమెరా ముందు ఎంతైనా ఎమోషన్స్ పండిరచడానికి వెసులుబాటు ఉంటుంది. ఆ విషయం డ్యూడ్‌తో నాకు బాగా తెలిసొచ్చింది. ఫ్యూచర్‌లోనూ ఇలాంటి కేరక్టర్లు వచ్చినప్పుడు ఈ ప్రాక్టీస్ ఉపయోగపడుతుంది'' అని అన్నారు మమిత. అసలు మమితతో తనకున్న అనుబంధం గురించి చెప్పుకొచ్చారు ప్రదీప్ రంగనాథన్. ''మమిత సినిమాల్లోకి రాకముందు ఓ షార్ట్ ఫిల్మ్‌లో నటించారు. ఆమె అప్పడాన్ని విరగ్గొట్టి తినే సీన్ నాకు చాలా బాగా నచ్చింది. నేను సినిమా చేసేటప్పుడు మమితను తీసుకోవాలనుకున్నా. కానీ ఆ సమయంలో వనంగాన్‌కి డేట్స్ ఇచ్చారు మమిత. (సూర్య చేయాల్సిన సినిమా వనంగాన్.. స్టార్ట్ కాకముందే ఆగిపోయింది. సూర్య ప్లేస్‌లో మరో హీరో చేశారు. సూర్యని అనుకున్నప్పుడు మమితను అనుకున్నారు. ఆ తర్వాత ఈక్వేషన్స్ మారిపోయాయి). అరే.. మంచి పెర్ఫార్మర్‌ని మిస్ అయ్యామే అనుకున్నా. కానీ డ్యూడ్ చేసే సమయంలో మమిత బైజును హీరోయిన్‌గా అనుకుంటున్నట్టు డైరక్టర్ చెప్పారు. వినగానే నాకు అప్పటిదాకా జరిగిందంతా కళ్ల ముందు తిరిగింది'' అని అన్నారు ప్రదీప్ రంగనాథన్. ఈ దీపావళికి విడుదలైన డ్యూడ్ మూవీ సూపర్ హిట్ టాక్ తో దూసుకుపోతుంది. తమిళంతోపాటు తెలుగులోనూ ఈ చిత్రానికి మంచి రెస్పాన్స్ వస్తుంది. మరోవైపు భారీగా కలెక్షన్స్ కొల్లగొడుతుంది. ఈ చిత్రంలో మమితా, ప్రదీప్ జంటగా నటించిన సంగతి తెలిసిందే.

## ఆర్‌టీ76తో వస్తున్న మాస్‌మహారాజ్ రవితేజ

అభిమానులకు కావాల్సిన ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించేందుకు రవితేజ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా మారిపోయాడు. ఇప్పటికే భాను భోగవరపు దర్శకత్వంలో నటిస్తోన్న మాస్ జాతర సినిమా అక్టోబర్ 31న విడుదలకు రెడీ అవుతోంది. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ నేపథ్యంలో మూవీ ప్రమోషన్స్ కూడా కొనసాగుతున్నాయి. కాగా ఈ సినిమా రిలీజ్ కాకముందే రవితేజ కొత్త సినిమా వార్త నెట్టింట వైరల్ అవుతోంది. కిశోర్ తిరుమల దర్శకత్వంలో రవితేజ నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఆర్‌టీ76. ఈ చిత్రంలో అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ఈ మూవీ అప్‌డేట్ షేర్ చేసి మూవీ లవర్స్, అభిమానుల్లో జోష్ నింపుతోంది ఆషికా రంగనాథ్. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ స్పెయిన్‌లో కొనసాగుతోంది. స్పెయిన్‌లో సాంగ్ షూట్ పూర్తయిన సంబంధించిన విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఈ షూట్‌తో స్పెయిన్ షెడ్యూల్ కూడా పూర్తయినట్టు తెలిపింది. రవితేజ్ అండ్ టీం త్వరలోనే ఇండియాకు తిరిగిరానుంది. ఇంకా టైటిల్ ఫిక్స్ కాని ఈ ప్రాజెక్టు 2026 సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. ఇండియాకు తిరిగిరాగానే మాస్ జాతర ప్రమోషన్స్‌తో బిజీ కానున్నాడు రవితేజ. ఈ చిత్రలో రవితేజ రైల్వే పోలీసాఫీసర్‌గా సందడి చేయబోతున్నాడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కుతున్ నీ చిత్రంలో రాజేంద్రప్రసాద్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నాడు.



## మొదటి రోజు థామా కలెక్షన్లు ఎంతో తెలుసా?

నేషనల్ క్రష్ రష్మిక మందన, బాలీవుడ్ హీరో ఆయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రల్లో దర్శకుడు ఆదిత్య సర్పోదర్ రూపొందించిన హారర్ కామెడీ చిత్రం 'థామా'. ఈ సినిమా దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్ దక్కించుకున్న ఈ చిత్రం మంచి వసూళ్లను రాబడుతుంది. ఈ చిత్రం తొలిరోజే రూ. 25.11 కోట్ల వసూళ్లు రాబట్టినట్లు చిత్రబృందం ప్రకటించింది. అంతేగాకుండా ఆయుష్మాన్ ఖురానా కెరీర్‌లో మొదటిరోజు ఈ స్థాయిలో వసూళ్లు సాధించిన మొదటి చిత్రంగా 'థామా' చిత్రం నిలిచింది. మరోవైపు వీకెండ్ వస్తుండటంతో ఈ కలెక్షన్లు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ సినిమాను మాడాక్ ఫిల్మ్స్ నిర్మించింది.




## బాలీవుడ్‌లో బిజీగా మారిన శ్రీలీల



పైకి ఖాళీగా ఉన్నట్లే కనిపిస్తుంది కానీ నిజానికి చాలా బిజీగా ఉన్నారు శ్రీలీల. అస్సలు ఖాళీ లేకుండా ఉన్నారీ భామ. ఓవైపు టాలీవుడ్.. మరోవైపు బాలీవుడ్.. ఇంకోవైపు కోలీవుడ్.. అన్ని ఉడ్లలో మోస్ట్ వాంటెడ్ అయిపోతున్నారు శ్రీలీల. ముఖ్యంగా ముంబై నుంచి అమ్మడికి అదిరిపోయే అవకాశాలు వస్తున్నాయి. ఆల్రెడీ కార్తిక్ ఆర్యన్ హీరోగా శ్రీలీల హిందీలో డెబ్యూ చేస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ వేగంగా జరుగుతుంది. 2026 ఫస్టాఫ్‌లో విడుదల కానుంది ఈ చిత్రం. ఇది సెట్స్‌పై ఉండగానే.. మరో రెండు మూడు ఆఫర్స్ శ్రీలీల ఖాతాలో చేరిపోయేలా ఉన్నాయి. మరోవైపు రణ్‌వీర్ సింగ్‌తో అట్లీ దర్శకత్వంలో ఓ యాడ్ చేసారు శ్రీలీల. దీన్ని ఏకంగా ఓ సినిమా రేంజ్‌లో తెరకెక్కించారు అట్లీ. తెలుగులోనూ ఫుల్ బిజీగా ఉన్నారు శ్రీలీల. ఇప్పటికే పవన్‌తో నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ షూట్ పూర్తి కాగా.. మాస్ జాతర అక్టోబర్ 31న విడుదల కానుంది. ఈ రెండిరటి తర్వాత శ్రీలీల తెలుగులో గ్యాప్ తీసుకుంటున్నారు. మరోవైపు తమిళంలో పొంగల్‌కు పరాశక్తితో రాబోతున్నారు. మూడు ఇండస్ట్రీలను కవర్ చేస్తూ సూపర్ బిజీ అయిపోయారు ఈ బ్యూటీ. వరస సినిమాలైతే చేస్తున్నారు కానీ విజయాల విషయంలో మాత్రం కాస్త వెనకబడ్డారు శ్రీలీల. చివరగా గుంటూరు కారం పర్లేదనిపిస్తే.. భగవంత్ కేసరి హిట్ లిస్టులో చేరింది. ఆ తర్వాత పుష్ప 2లో కిస్ కిస్ కిసిక్ పాటతో దేశాన్ని ఊపేసారు ఈ బ్యూటీ. ఇప్పుడు మళ్లీ జోరు పెంచేస్తున్నారు. మరి ఇందులో ఆమె కోరుకున్న విజయం ఏ ఇండస్ట్రీ నుంచి వస్తుందో చూడాలి.

## స్పీడ్ పెంచిన శ్రీనిధి శెట్టి



టాలీవుడ్‌లో మరో క్రేజీ కాంబినేషన్ ఫిక్స్ అయ్యింది. విక్టరీ వెంకటేశ్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ చిత్రం రూపుదిద్దుకుంటున్న విషయం తెలిసిందే. హారిక అండ్ హాసిని చిత్ర నిర్మాణ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. అయితే ఈ సినిమాలో కథానాయిక విషయంలో శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా అంటూ పలువురి పేర్లు తెర మీదకు వచ్చినా చివరకు కన్నడ నటి శ్రీనిధి శెట్టిని ఫైనల్ చేశారు. తాజాగా మంగళవారం శ్రీనిధి జన్మదినాన్ని పురస్కరించుకుని మేకర్స్ శుభాకాంక్షలు తెలుపుతూ అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే ఈ ఏడాది హిట్ 3 చిత్రంతో మంచి విజయం రుచి చూసిన శ్రీనిధి దీపావళికి తెలుసు కదా అనే సెన్సిబుల్ సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇది ఇలా ఉండగానే విక్టరీ వెంకటేశ్, త్రివిక్రమ్ వంటి అగ్ర స్థాయి టీమ్‌తో పని చేసే ఛాన్స్ దక్కడంతో ఆమె ఆనందానికి అవధులు లేకుంగా పోయాయి. ఇప్పుడు ఈ చిత్రమే కాకుండా తమిళంతో అజిత్‌తో ఒకటి తెలుగులో మరో రెండు సినిమాలు సైతం అమ్మడి చేతిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉంటే.. ఇప్పటికే వెంకటేశ్ సూపర్ హిట్ చిత్రాలు 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ రచన చేశారు. దీంతో ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ప్రేక్షకుల్లో విపరీతమైన అంచనాలు ఏర్పడ్డాయి. అదేవిధంగా తమన్ కాకుండా యానిమల్ ఫేం హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండడం విశేషం. కాగా ఈ మూవీ 2026 వేసవిలో ప్రేక్షకుల ఎదుటకు వచ్చే అవకాశం ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999